చీఫ్ ఎడిటర్: బత్తుల గణేష్

తెలుగు
# సంచలనం
ప్రతి అక్షరం – ప్రజల పక్షం
జాతీయ వార్త పత్రిక

www.sanchalanamnews.in epaper.sanchalanamnews.in

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 9 | పేజీలు : 8 | గురువారం 18 జూన్ 2026 | వెల : 3/-

Circulated by Hyderabad, Nalgonda, Khammam, Mahaboobnagar, Rangareddy, Medhak, Karimnagar, Adhilabad, Nizamabad, Warangal, Vijayawada, Tirupathi



## ఈ వ్యవస్థతో పిల్లల కలలు నాశనం

- పరీక్ష ఖర్చు విద్యా శాఖ బడ్జెట్‌తో సమానం
- భారత విద్యా విధానం పిల్లలపై ఒత్తిడిని పెంచి, వారిని మానసికంగా అణచివేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణ

# ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ వసతులు



- తెలంగాణ భవిష్యత్ పునర్నిర్మాణం తరగతి గదుల్లోనే ఉంది
- ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం
- ఇక్కడ మంచి నాయకత్వ లక్షణాలు ఉంటాయన్న రేవంత్
- ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్

ప్రభుత్వ విద్యావ్యవస్థను అభివృద్ధి దిశగా తీసుకెళ్లేలా రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో ప్రభుత్వం నిర్మించిన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' (టీపీఎస్) భవనాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా, సుమారు రూ. 15 కోట్ల భారీ వ్యయంతో ఈ విద్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఆరుట్లకు చేరుకున్న సీఎం, ముందుగా స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించి పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో - మిగతా3లో



## రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో వారికే తొలి ప్రాధాన్యత

- హౌసింగ్ అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి టెలీకాన్ఫరెన్స్
- గుడిసెలు లేని తెలంగాణ లక్ష్యమని స్పష్టీకరణ
- రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో గుడిసెల్లో ఉన్న వారికి ప్రాధాన్యమిస్తామని వెల్లడి
- రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమంలో సుమారు 75 వేల మంది తాము గుడిసెల్లో నివసిస్తున్నామని దరఖాస్తు చేసుకున్నారు

హైదరాబాద్

గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు సర్కారు ప్రత్యేక కార్యాచరణను చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గుడిసెలను గుర్తించేందుకు సమగ్ర సర్వే చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియపై - మిగతా3లో



## ప్రతిపక్ష నేతలను ఎన్‌డీఏలోకి లాగేందుకు ప్రయత్నాలు

- అమిత్ షాపై కాంగ్రెస్ విమర్శలు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర విమర్శలు గుప్పించిన జైరాం రమేశ్
- ప్రతిపక్ష పార్టీలను బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపణ
- భారీ ప్రలోభాలతో ఎంపీలు, ఎమ్మెల్యేలను బీజేపీలోకి ఆకర్షిస్తున్నారన్న కాంగ్రెస్ నేత



## భారత్‌పై దాడి జరిగితే అండగా ఉంటాం, కానీ

- భారత్‌పై దాడి జరిగితే అమెరికా అండగా ఉంటుందని ట్రంప్ హామీ
- మోదీ ఉన్నంత వరకు మద్దతు ఉంటుందని స్పష్టీకరణ
- ఒకవేళ కొత్త నాయకుడు వస్తే చెప్పలేనని వ్యాఖ్య
- జీ7 సదస్సు వేదికగా ప్రధాని మోదీ, ట్రంప్ ద్వైపాక్షిక భేటీ



## కుటుంబానికి జీవనోపాధి

- హనుమకొండలో అభిమానిని పరామర్శించిన పవన్ కల్యాణ్
- చల్లగా ఉండాలంటూ ప్రేమతో డైరీలో నోట్
- ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న నిరంజన్
- బాలుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- అనంతరం భద్రకాళి అమ్మవారి ఆలయంలో బాబు పేరిట ప్రత్యేక పూజలు

# అభివృద్ధి పనుల్లో అవినీతి వరద

- లంచాలు ఆర్జించే అధికారులపై అవినీతి నిరోధక శాఖ కొరడా
- ప్రభుత్వ స్వేచ్ఛతో దూకుడు పెంచిన ఏసీబీ
- గడిచిన సంవత్సరాల్లో రికార్డు స్థాయిలో కేసులు నమోదు
- ముందు వరుసలో పోలీసు, రెవెన్యూ శాఖలు
- అభివృద్ధి పనుల పేరుతో అవినీతికి పాల్పడుతున్న అధికారులు

హైదరాబాద్

ప్రస్తుతం కొందరు అధికారులు చాప కింద నీరులా అవినీతికి పాల్పడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా లంచాలు తీసుకుంటూ అక్రమంగా ఆస్తులను పోగేసుకుంటున్నారు. ఇలాంటివి అధికమవుతుండటంతో అవినీతి నిరోధకశాఖ వీటిపై దృష్టిసారించింది. గడచిన 13 రోజుల్లోనే ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు మూడు నమోదు చేసి అధికారుల చిట్టా బయటపెట్టింది. అక్రమార్కులపై ఏసీబీ కొరడా ఝుళిపిస్తుండటంతో అంతా అప్రమత్తమవుతున్నారు. నిదర్శనంగా పలు ఘటనలు అధికారిక లెక్కల ప్రకారం గడిచిన 13 రోజుల్లో ఏసీబీ - మిగతా3లో



## భారత్ ఆల్ టైమ్ రికార్డ్

- రక్షణ రంగ ఉత్పత్తుల విలువ రూ. 1.78 లక్షల కోట్లు
- రాజ్‌నాథ్ సింగ్ కీలక ప్రకటన
- భారత రక్షణ రంగంలో మరో చారిత్రాత్మక విజయం
- 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఆల్ టైమ్ హైకి రక్షణ రంగ ఉత్పత్తుల విలువ–ఏకంగా రూ. 1.78 లక్షల కోట్లుగా నమోదు

## దేశవ్యాప్తంగా 'ఎల్ నినో' ముప్పు..

- ఏపీ, తెలంగాణ సహా 12 రాష్ట్రాల్లో వర్షాభావం
- ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 12 రాష్ట్రాలపై ఎల్ నినో ప్రభావం
- ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన కేంద్ర వ్యవసాయ మంత్రి
- ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచన



## సైబర్ నేరగాళ్లు సమాజానికి పరాన్నజీవులు

- సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- సైబర్ నేరగాళ్లను సమాజానికి పరాన్నజీవులతో పోల్చిన సుప్రీంకోర్టు
- ఆన్‌లైన్ మోసం కేసులో నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరణ
- అమాయక ప్రజల సొమ్మును కాజేస్తున్నారని ధర్మాసనం తీవ్ర వ్యాఖ్య
- ఎఫ్ఐఆర్‌ల విలీనానికి హైకోర్టులను ఆశ్రయించాలని నిందితుడికి సూచన
- ఇలాంటి నేరస్థులను జైల్లో ఉంచడమే సమాజానికి శ్రేయస్కరం అని వ్యాఖ్య



# ఈ వ్యవస్థతో పిల్లల కలలు నాశనం

భారత విద్యా విధానం పిల్లలపై ఒత్తిడిని పెంచి, వారిని మానసికంగా అణచివేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. ఈ వ్యవస్థ విద్యార్థులను ప్రధానంగా ఇంజనీరింగ్, వైద్యం, సివిల్ సర్వీసెస్ వంటి కొన్ని వృత్తి మార్గాల వైపు మాత్రమే మళ్లిస్తోందన్నారు. ఇతర రంగాల పట్ల ఆసక్తిని నిరుత్సాహపరుస్తోందని, పిల్లల కలలను నాశనం చేస్తుందని అన్నారు. కోచింగ్ కేంద్రాలకు ప్రసిద్ధి చెందిన రాజస్థాన్?లోని కోటాలో నిర్వహించిన 'ఛాత్రోన్ కి గూంజ్' (విద్యార్థుల గళం) మహా ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆయన పేపర్ లీక్‌లు, నిరుద్యోగం వంటి వివిధ అంశాలపై విద్యార్థులతో ముఖాముఖి చర్చించారు.

"ఇది రాజకీయ సమావేశం కాదు. ఇది మీ గురించి, ఉజ్వల భవిష్యత్తు కోసం పోరాడుతున్న యువత కోసం జరుగుతున్న సమావేశం. మన దేశంలో పిల్లలను కేవలం ఐదు పనులు మాత్రమే ఎందుకు చేయమని అడుగుతున్నారు? దానికి సమాధానం 'డబ్బు'. ఎందుకంటే ఈ వ్యవస్థ ఆ ఐదు మార్గాల ద్వారానే డబ్బు సంపాదిస్తోంది. భారత విద్యా వ్యవస్థ ఒక దోపిడీ యంత్రం. యువత పెద్ద కలలు కనేలా ప్రోత్సహించే వ్యవస్థ మాకు కావాలి. దేశంలోని యువత తీవ్రమైన వేదన, ఒత్తిడి, అసంతృప్తికి గురవుతున్నారు. ఇది దేశానికి మంచిది కాదు." ఈ క్రమంలోనే చీజుజు, జీజుజు, ఖురాజ సివిల్ సర్వీసెస్ పరీక్ష, ూూజ, ==దీ వంటి పరీక్షలను రాహుల్ గాంధీ ప్రస్తావించారు. పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తామన్న గ్యారెంటీ లేకపోయినా, లక్షలాది మంది విద్యార్థులు పాఠశాల విద్య, కోచింగ్ సంస్థలు, యూనిఫాంలు హాస్టల్ వసతుల



కోసం భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. చాలా తక్కువ సంఖ్యలో ఉండే పోస్టుల కోసం లక్షలాది మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారని ఆయన అన్నారు. కేవలం చీజుజు పరీక్షకే దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు హాజరవుతుండగా, లక్ష కంటే తక్కువ మంది మాత్రమే ఎంపికవుతున్నారని, ఇది చాలా కఠినమైన పోటీ అని అన్నారు. ఇటువంటి విధానాలు విద్యా వ్యవస్థను అత్యంత కఠినంగా, చాలా మందికి అవకాశాలు దక్కకుండా చేసేలా మారుస్తున్నాయని అభిప్రాయపడ్డారు.

విద్యా రంగ ఆర్థిక వ్యవస్థ ప్రతి ఏటా కుటుంబాల నుంచి భారీ మొత్తంలో డబ్బును వసూలు చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. కేవలం ఒక పరీక్ష కోసమే విద్యార్థులు, వారి కుటుంబాలు కలిసి ప్రభుత్వ మొత్తం విద్యా బడ్జెట్‌కు సమానమైన మొత్తాన్ని ఖర్చు చేస్తున్నారని విమర్శించారు.

చీజుజు పరీక్షకు 22 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నారని, వారు మొత్తం రూ. 1.32 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఇది విద్యా శాఖ బడ్జెట్ కేటాయింపులకు సమానమన్నారు.

"అనే ఐదు ప్రధాన పరీక్షలను విద్యార్థులు తమ కలలుగా భావిస్తారు. ఈ ఐదు పరీక్షల కోసం కుటుంబాలు కలిసి దాదాపు రూ. 3.5 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఈ మొత్తం విద్య, ఆరోగ్యం, కార్మిక, విజ్ఞాన శాస్త్రం, మహిళా-శిశు అభివృద్ధి వంటి మంత్రిత్వ శాఖలపై ప్రభుత్వం చేసే వ్యయంతో సమానం. ఇంత భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ, చాలా తక్కువ శాతం మంది విద్యార్థులు మాత్రమే స్థిరమైన ఉద్యోగాలను పొందుతున్నారు. మిగిలిన వారు అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. ప్రతి వెయ్యి మంది విద్యార్థుల్లో కొద్దిమందికి మాత్రమే జీతంతో కూడిన ఉద్యోగాలు లభిస్తున్నాయి. మిగిలిన వారు ఇబ్బందులు పడుతున్నారు." ప్రతి 100 మంది ఇంజనీర్లలో దాదాపు 80 మంది నిరుద్యోగులుగా ఉన్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. యువత తమ జేబుల నుంచి లక్షలు, కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా, అత్యల్ప వ్యయంతోనే తమ కలలను సాకారం చేసుకునేలా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐదుగురు విద్యార్థులతో రాహుల్? గాంధీ ముచ్చటించారు. చీజుజు, జీజుజు, సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారి కలలు, పరీక్షల సన్నద్ధత, వాటి కోసం వెచ్చించిన ఖర్చు, ఎంపిక అవకాశాల గురించి మాట్లాడారు.

# ప్రతిపక్ష నేతలను ఎన్‌డీఏలోకి లాగేందుకు ప్రయత్నాలు

కేంద్ర హోంమంత్రి అమిత్?షాపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. రాజ్యాంగ సవరణ బిల్లు ఓటమికి ప్రతీకారంగా ప్రతిపక్షాలపై దాడిచేయటంతోపాటు ప్రజాస్వామ్యాన్ని ఆయన ధ్వంసం చేస్తున్నారని ఆరోపించింది. రెండేళ్ల క్రితం బీజేపీ-వ్యతిరేక అజెండాతో ఎన్నికైన వారిని ప్రలోభాలకు గురిచేసి ఎన్?డీఏ వైపు ఆకర్షిస్తున్నారని విమర్శించింది. పార్టీ ఫిరాయించేవారికి ఇచ్చే ప్రోత్సాహకాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు.





**'మ్యూచువల్ ఫండ్స్ తరహా రాజకీయ వ్యూహం'**

ప్రతిపక్ష నేతలను ఆకర్షించేందుకు అనుసరిస్తున్న వ్యూహాన్ని జైరాం రమేశ్ "మ్యూచువల్ ఫండ్స్"తో పోల్చారు. ఎవరిని పార్టీలోకి తీసుకురావాలనుకుంటే వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ప్యాకేజీలు సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. ఇది పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసం సాగుతున్న చర్య అని విమర్శించారు. అమిత్ షా రాజకీయ వ్యూహాలకు హద్దులు లేవని, అయితే చివరికి ఆయన లక్ష్యం నెరవేరదని స్పష్టం చేశారు. మహారాష్ట్ర రాజకీయాల్లో నెలకొన్న ఊహాగానాలు, ఉద్ధవ్ వర్గం మరోసారి చీలనుందని వార్తలు వస్తోన్న నేపథ్యంలో జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

**మహా రాజకీయాల్లో ఉత్కంఠ**

మహారాష్ట్రకు చెందిన ఎంపీలను కొనుగోలు చేసేందుకు రూ.15 కోట్ల అడ్వాన్స్ చెల్లిస్తున్నారనే సమాచారం తనకు అందిందని సంజయ్ రౌత్ ఆరోపించారు. ఈ వ్యవహారం షాకింగ్‌గా, అసహ్యకరంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో శివసేన (యూబీటీ)కు చెందిన కొందరు లోక్‌సభ సభ్యులు అధికార శివసేనలో చేరే అవకాశాలపై ఊహాగానాలు కొనసాగుతున్నాయి. అధికార శివసేన నేత ప్రతాప్ సర్నాయక్ కూడా అసంతృప్త నేతలకు స్వాగతం పలుకుతామని సంకేతాలు ఇవ్వడంతో ఈ ప్రచారం మరింత బలపడింది.

**ఎంపీలకు విప్?**

ఇదిలా ఉండగా శివసేన (యూబీటీ) వర్గాలనికి చెందిన కొందరు లోక్‌సభ ఎంపీలు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు పార్టీ ఫిరాయింపు ప్రచారం మధ్యే శివసేన (యూబీటీ) వర్గం తమ ఎంపీలకు విప్ జారీచేసింది. దిల్లీలో జరిగే సమావేశానికి హాజరుకావాలని సూచించింది. కొందరు ఎంపీలు ఏక్‌నాథ్ శిందే వర్గంలో చేయనున్నారనే ప్రచారం మధ్య ఉద్ధవ్ వర్గం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశానికి హాజరుకాని ఎంపీలపై అనర్హత వేటువేసే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన 9మంది లోక్‌సభ ఎంపీల్లో ఆరేడు మంది ఎంపీలు పార్టీ మారనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. 2022లో ఏక్‌నాథ్ శిందే నాయకత్వంలోని 39మంది ఎమ్మెల్యేలు, కొందరు ఎంపీలు తిరుగుబాటు చేశారు.

దీంతో ప్రస్తుతం శివసేన (యూబీటీ) ఎంపీలు నిజంగానే శిందే వర్గంలో చేరతారా? లేక ఇది కేవలం రాజకీయంగా ఒత్తిడి సృష్టించే ప్రయత్నమేనా? అన్నది దిల్లీలో జరగనున్న సమావేశాల తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఒకవైపు ఎంపీల ఫోన్లు స్విచ్ ఆఫ్ కావడం, కీలక నేతలు దిల్లీలో మకాం వేయడం, వరుస భేటీలు మహారాష్ట్ర రాజకీయాల్లో మరో పెద్ద ట్విస్ట్‌కు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. ఎంపీలు నిజంగానే పార్టీ మారితే ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి మరో పెద్ద ఎదురుదెబ్బ తగలనుంది.

**తృణమూల్ కాంగ్రెస్‌లో తిరుగుబాటు**

మరోవైపు టీఎంసీలో కూడా రాజకీయ సంక్షోభం నెలకొంది. తిరుగుబాటు చేసిన 20 మంది ఎంపీలు ఇటీవల లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి, తాము నేషనల్ సిటిజన్స్? పార్టీ ఆఫ్? ఇండియాలో విలీనమవుతున్నట్లు ప్రకటించారు. తిరుగుబాటు వర్గానికి చెందిన ఎంపీ అరూప్ చక్రవర్తి మాట్లాడుతూ, పార్టీని సరిదిద్దేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. పార్టీ ఎన్నికల గుర్తుపై కూడా తమ హక్కును చాటుకుంటామని పేర్కొన్నారు. అయితే మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ఈ చర్యను పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి విరుద్ధమని అభివర్ణించింది.

# భారత్ ఆల్ టైమ్ రికార్డ్

భారత రక్షణ రంగం స్వయం సమృద్ధి దిశగా జెట్ స్పీడ్‌లో దూసుకెళ్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఆత్మ నిర్భర్ భారత్ పిలుపుతో దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీ సరికొత్త మైలురాయిని అధిగమించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత రక్షణ రంగ ఉత్పత్తుల విలువ ఏకంగా రూ. 1.78 లక్షల కోట్లకు చేరుకుంది. ఇప్పటి వరకు ఇదే అత్యధికం. అంటే ఆల్ టైమ్ రికార్డుగా చెప్పొచ్చు. ఈ విషయాన్ని భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం అధికారికంగా వెల్లడించారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 15.6 శాతం ఎక్కువ. 2020-21 ఆర్థిక సంవత్సరంతో చూస్తే అంటే ఐదేళ్లలో రికార్డు స్థాయిలో 110 శాతం వృద్ధి నమోదు చేసింది. రక్షణ మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం దేశీయంగా తయారీ ఒకప్పటితో పోలిస్తే విపరీతంగా పెరగడం, ప్రైవేట్ రంగం భాగస్వామ్యం మరింత విస్తరించడం, రక్షణ ఎగుమతులు గణనీయంగా పెరగడం ఈ భారీ వృద్ధికి దోహదపడింది. ఇవే ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. భారత రక్షణ రంగం సాధించిన ఘనతపై మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత రక్షణ ఉత్పత్తి ప్రతి ఏటా సరికొత్త శిఖరాల్ని అధిరోహిస్తుందని వ్యాఖ్యానించారు. '2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత రక్షణ ఉత్పత్తి రూ. 1.78 లక్షల కోట్లకు చేరడం దేశ రక్షణ రంగ బలానికి నిదర్శనం.' అని సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి నిరంతర విధానపరమైన మద్దతు, కొత్త ఆవిష్కరణలతో రానున్న రోజుల్లో రక్షణ రంగం మరింత వేగంగా దూసుకెళ్తుందని



ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈసారి రక్షణ ఉత్పత్తిలో ప్రైవేట్ కంపెనీల పాత్ర మరింత పెరిగింది. మొత్తం రక్షణ రంగం ఉత్పత్తుల్లో 76 శాతం ప్రభుత్వ రంగ సంస్థల వాటానే. 24 శాతం వాటా ప్రైవేట్ రంగ కంపెనీలది. ఇక ఇందులో ప్రైవేట్ రంగ ఉత్పత్తి విలువ సుమారు రూ. 42 వేల కోట్లుగా ఉంది. గతేడాది 22 శాతంగా ఉన్న ఈ వాటా ఈసారి 24 శాతానికి చేరింది. దీంతో భారత రక్షణ రంగంలో ప్రైవేట్ కంపెనీల ప్రాధాన్యం పెరుగుతున్నట్లు సూచిస్తోంది.

**రికార్డు స్థాయికి రక్షణ ఎగుమతులు**

భారత్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తితో పాటు ఎగుమతుల్లోనూ సరికొత్త చరిత్ర సృష్టించింది. గత ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఎగుమతులు రూ. 38,424 కోట్లకు చేరి జీవన కాల గరిష్ఠాల్ని నమోదు చేశాయి. భారతదేశంలో తయారైన ఆయుధాలు, రక్షణ పరికరాలు, సాంకేతికతపై విదేశాల నమ్మకం పెరుగుతుందనేందుకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి.

గత కొన్నేళ్లలో చూస్తే 2013-14 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తుల విలువ రూ. 43,746 కోట్లుగా ఉండగా అక్కడి నుంచి ప్రస్తుతం 4 రెట్లు పెరిగింది. 2020-21 లో రూ. 84,643 కోట్లుగా ఉండగా.. అక్కడితో డబుల్ అయింది. 2024-25 లో రూ. 1.54 లక్షల కోట్లు, 2025-26 లో రూ. 1.78 లక్షల కోట్లుగా నమోదైంది. ఇది రక్షణ రంగం ఎదుగుదలను సూచిస్తోంది. భారత రక్షణ ఉత్పత్తి పెరగడం వల్ల విదేశీ ఆయుధాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. దేశీయ భద్రత మరింత బలోపేతం అవుతుంది. దేశీయంగా పరిశ్రమలకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ఎగుమతులు పెరగడం వల్ల విదేశీ మారక ద్రవ్యం లభిస్తుంది. అత్యాధునిక సైనిక సాంకేతికత మన దేశంలోనే అభివృద్ధి చెందుతుంది.

## భారత్‌పై దాడి జరిగితే అండగా ఉంటాం, కానీ



భారత్‌పై దాడి జరిగితే అమెరికా సైనిక సహకారం అందిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హామీ ఇచ్చారు. జీ7 సదస్సులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య అధికారికంగా ఎలాంటి రక్షణ ఒప్పందం లేనప్పటికీ, ట్రంప్ బహిరంగంగా ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. బుధవారం ప్రధాని మోదీతో భేటీ అనంతరం ఇరు దేశాల రక్షణ సంబంధాలపై మీడియా అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. "మా మధ్య అధికారిక ఒప్పందాలేవీ లేవు. అయినప్పటికీ, భారత్‌పై దాడి జరిగితే మేము అండగా నిలవడానికి సిద్ధంగా ఉన్నాం" అని స్పష్టం చేశారు. అనంతరం ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ, "ఆయనపై ఎవరైనా దాడి చేస్తే మేము అండగా ఉంటాం. ఒకవేళ కొత్త నాయకుడు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో నాకు తెలియదు కానీ, మోదీ నాయకత్వంలో భారత్‌కు మా పూర్తి సహకారం ఉంటుంది" అని వ్యాఖ్యానించారు. ఉభయ దేశాల మధ్య సంబంధాలు అసాధారణ స్థాయిలో బలపడ్డాయని ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ఒప్పందం కుదరవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపిస్తూ "చర్చల విషయంలో ఆయన చాలా నిక్కచ్చిగా వ్యవహరిస్తారు. అత్యంత కఠినంగా వ్యవహరించే నాయకుల్లో ఆయన ఒకరు" అని కొనియాడారు. ఈ భేటీ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, గత ఏడాది వాషింగ్టన్‌లో జరిగిన సమావేశం తర్వాత ఇరు దేశాల సంబంధాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోందని అన్నారు. తాను అధ్యక్షుడిగా ఉన్నంత కాలం వైట్‌హౌస్‌లో భారత్‌కు అత్యంత సన్నిహిత మిత్రుడు ఉంటాడని ఈ సందర్భంగా ట్రంప్ భరోసా ఇచ్చారు.

## సైబర్ నేరగాళ్లు సమాజానికి పరాన్నజీవులు

సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల సంపదను దోచుకునే 'పరాన్నజీవులు' అని, వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉందని సుప్రీంకోర్టు బుధవారం ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఒక సైబర్ మోసం కేసులో నిందితుడికి బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. తనపై వివిధ రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను కలిపి విచారించాలని కోరుతూ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఈ అంశంపై సంబంధిత హైకోర్టులను ఆశ్రయించాలని ధర్మాసనం సూచించింది. "మీలాంటి వారు పరాన్నజీవులు. అమాయక మదుపరుల నుంచి సొమ్ము వసూలు చేసి వారిని వంచిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల విషయంలో మేము అత్యంత కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుంది" అని విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఈ తరహా నేరగాళ్లు తమిళనాడు నుంచి జమ్మూకశ్మీర్ వరకు దేశవ్యాప్తంగా అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ధర్మాసనం ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి నేరస్థులను జైల్లోనే ఉంచడం సామాజిక ప్రయోజనాలకు శ్రేయస్కరమని ధర్మాసనం పేర్కొంది. దేశంలో "డిజిటల్ అరెస్ట్" వంటి స్కామ్‌లతో సహా ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ మోసాల ధాటికి వృద్ధులు, సామాన్యులు కోట్ల రూపాయలు మేర నష్టపోతున్నారని, అటువంటి వారిని కట్టడి చేసేందుకు కఠినమైన న్యాయపరమైన వైఖరి అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

## దేశవ్యాప్తంగా 'ఎల్ నినో' ముప్పు..

రైతులకు, వ్యవసాయ రంగానికి ఆందోళన కలిగించే ఒక కీలక అప్‌డేట్ వాతావరణ శాఖ నుండి వచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దేశంలోని దాదాపు 12 రాష్ట్రాలపై 'ఎల్ నినో' తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ముందస్తుగా అప్రమత్తమైంది. ఖరీఫ్ 2026 సన్నద్ధతపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాధారణం కంటే తక్కువగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని కీలక వ్యవసాయ ఆధారిత రాష్ట్రాలపై ప్రభావం ఉంటుందని తెలిపింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్, ఝార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో, శివరాజ్ సింగ్ చౌహాన్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు తగ్గితే రైతులు నష్టపోకుండా ఉండేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో ఉన్న జిల్లా అధికారులు, రాష్ట్రాల వ్యవసాయ విభాగాలు, కృషి విజ్ఞాన్ కేంద్రాలు, ఇతర అనుబంధ సంస్థలతో తక్షణమే సమన్వయ సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. కరువు లాంటి పరిస్థితులు ఎదురైతే ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

## ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన గ్రీన్ గోల్ఫ్ కోర్స్‌కు టూరిస్టుల ఫిదా! బ్రిటిష్ కాలంలోనే నిర్మాణం

చుట్టూ ఆకాశాన్ని తాకే హిమాలయ పర్వతాలు, మధ్యలో పచ్చని మైదానంలో ప్రకృతి సోయగాల మధ్య గోల్ఫ్ ఆట. ఇది వింటుంటేనే ఎంతో ఆహ్లాదంగా ఉంది కదూ. అలాంటి ప్రదేశం నిజంగా ఉందా? అనే సందేహం కూడా మొదలవుతుంది. కానీ అది నిజంగానే ఉంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన గ్రీన్ గోల్ఫ్ కోర్సుల్లో ఒకటిగా పేరొందిన గుల్మార్గ్ గోల్ఫ్ కోర్స్ ప్రస్తుతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ గోల్ఫ్ కోర్స్ వేసవిలో పచ్చదనంతో కళకళలాడుతుండగా, శీతాకాలంలో దట్టమైన మంచు దుప్పటి కప్పుకుని మరో అందాన్ని సంతరించుకుంటుంది. అరుదైన పూలతో ఉండే ఈ ప్రకృతి రమణీయ ప్రదేశాన్ని చూసేందుకు దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యటకులు తరలివస్తున్నారు. కశ్మీర్?లోని గుల్మార్గ్‌లో సముద్ర మట్టానికి సుమారు 2,650 మీటర్ల (8,694 అడుగులు) ఎత్తులో ఉన్న ఈ గోల్ఫ్ కోర్స్ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. పచ్చని మైదానాలు, చుట్టూ మంచు పర్వతాల నడుమ విస్తరించిన ఈ కోర్స్, గోల్ఫ్ క్రీడాకారులను మాత్రమే కాకుండా సాధారణ పర్యటకులను కూడా విశేషంగా ఆకర్షిస్తోంది. 18 హోల్స్‌తో రూపొందించిన ఈ గోల్ఫ్ కోర్స్ భారతదేశంలోనే అత్యంత పొడవైన గోల్ఫ్ కోర్స్‌గా పేరుగాంచింది. ప్రతి ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు ఈ గోల్ఫ్ కోర్స్ సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. వేసవి, వర్షాకాలాల్లో పచ్చదనంతో మెరిసిపోతూ గోల్ఫ్ ప్రేమికులకు అద్భుతమైన అనుభూతిని అందిస్తుంది. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో వివిధ రకాల అడవి పూలు వికసించి ఈ ప్రాంత సౌందర్యాన్ని మరింత రెట్టింపు చేస్తాయి. శీతాకాలంలో భారీగా మంచు కురవడంతో గోల్ఫ్ కోర్స్ పూర్తిగా మంచుతో కప్పుకుపోతుంది. ఆ సమయంలో ఈ ప్రాంతాన్ని స్కీయింగ్, ఇతర శీతాకాల క్రీడల కోసం వినియోగిస్తారు. దీంతో ఏడాది పొడవునా గుల్మార్గ్ పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గుల్మార్గ్ గోల్ఫ్ కోర్స్‌కు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. బ్రిటిష్ పాలన కాలంలో 1911లో దీనిని నిర్మించారు. అనంతరం 1922లో ఇక్కడ తొలి గోల్ఫ్ ఛాంపియన్‌షిప్ నిర్వహించారు. అప్పటి నుంచి ఇది అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతూ ప్రపంచవ్యాప్తంగా గోల్ఫ్ క్రీడాకారులను ఆకర్షిస్తోంది. ప్రస్తుతం అనుకూల వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో పర్యాటకులు గుల్మార్గ్‌కు చేరుకుంటున్నారు. ప్రకృతి అందాలను ఆస్వాదించడంతో పాటు గోల్ఫ్ ఆడుతూ తమ సెలవులను ఆనందంగా గడుపుతున్నారు.

సంచలనం

గురువారం
18 జూన్ 2026

# ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ వసతులు

-మొదటిపేజీ తరువాయి

కార్పొరేట్ వసతులు కల్పించే దిశగా తమ ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యపై తల్లిదండ్రులకు పలు అపోహలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణం చేపట్టినట్లు సీఎం తెలిపారు. విద్యాశాఖపై తమ ప్రభుత్వం 27 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నదని, గత ప్రభుత్వం విద్యావ్యవస్థను నీరుగార్చిందని ఆరోపించారు.

ముఖ్యమంత్రి పాఠశాలలోని తరగతి గదులను నిశితంగా పరిశీలిస్తూ క్యాంపస్ అంతా కలియతిరిగారు. ఈ సందర్భంగా అక్కడ చదువుకుంటున్న విద్యార్థులతో కాసేపు ఆత్మీయంగా ముచ్చటించిన రేవంత్ రెడ్డి, తరువాత వారితో కలిసి కూర్చుని ఎంతో ఉత్సాహంగా అల్పాహారం తీసుకున్నారు. స్కూల్‌లోని అత్యాధునిక వంటగదిని పరిశీలించారు. వంట చేస్తున్న మహిళా సిబ్బందితో కలిసి సరదాగా ముచ్చటిస్తూ, స్వయంగా చపాతీలు (పూరీలు) ఒత్తి వారిలో ఉత్సాహం నింపారు. అనంతరం అక్కడ ఉన్న వారందరితో కలిసి గ్రూప్ ఫొటోలు దిగారు.

ఈ అంతర్జాతీయ స్థాయి మోడల్ పాఠశాలలో కల్పించిన అద్భుతమైన మౌలిక వసతుల గురించి విద్యా కమిషన్ మాజీ ఛైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ముఖ్యమంత్రికి క్షుణ్ణంగా వివరించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఈ క్యాంపస్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, అధునాతన సైన్స్ ల్యాబ్‌లు, విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయం (లైబ్రరీ), హైటెక్ కిచెన్, విశాలమైన డైనింగ్ హాల్‌తో పాటు ఆటల కోసం పెద్ద క్రీడా మైదానాన్ని కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని ఆయన పేర్కొన్నారు.

ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే తనపై కొంత మంది విమర్శలు చేశారని సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామన్న ఆయన మెస్సీ డ్రగ్స్ ముఠా లీడర్ కాదు, ఆర్థిక నేరగాడు కాదని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే నెల రోజులకే చిరిగేవన్న ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని తెలిపారు. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్ల టెండర్లతో పిలిస్తే అందులో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని మాజీ మంత్రి హరీశ్?రావు అంటున్నారని



పరోక్షంగా విమర్శలు గుప్పించారు. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2 వేల కోట్ల స్కామ్ ఎలా సాధ్యమో చెప్పాలని అన్నారు. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతామని పునరుద్ఘాటించారు.

### వంటగదిలో పూరి చేసిన సీఎం

టీపీఎస్‌ను ప్రారంభించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి పాఠశాల ప్రాంగణంలో మొత్తం కలియతిరిగారు. ముందుగా కిచెన్‌లోకి వెళ్లారు. అక్కడి సిబ్బందితో కలిసి పూరీ చేశారు. అనంతరం అందరితో కలిసి ఫోటో దిగారు. తరగతి గదులను నిశితంగా పరిశీలించారు. ఆయన వెంట మాజీ ఐఏఎస్? ఆకునూరి మురళి తెలంగాణ పబ్లిక్ స్కూల్?కు సంబంధించిన అన్ని వివరాలను క్షుణ్ణంగా తెలిపారు. టీపీఎస్?ను కార్పొరేట్ స్కూల్ స్థాయిలో రూ.15 కోట్లతో ప్రభుత్వం నిర్మించింది. స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్, క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్? బాబు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్? రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి, ప్రభుత్వ సలహదారు కేశవరావు, విద్యా కమిషన్ మాజీ ఛైర్మన్ ఆకునూరి మురళి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఇతరులు పాల్గొన్నారు.

కొత్త తరానికి సరికొత్త అవకాశాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఎప్పుడూ చెప్తుంటారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. విద్యకు పెద్దపీట వేసి, ప్రభుత్వ విద్యను తీర్చిదిద్దాలని చెప్తుంటారని, భావితరాల కోసం ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీ నిర్మాణాన్ని చేపట్టినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణం చేపట్టామన్న ఆయన తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తామన్నారు. అత్యుత్తమ విద్య, వైద్యం నినాదంతో సీఎం ముందుకెళు _న్నారని పేర్కొన్నారు.

ఈ వేడుకలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మల్రెడ్డి రంగారెడ్డిలు పాల్గొన్నారు. వీరితో పాటు ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పలువురు ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కుటుంబానికి జీవనోపాధి

హనుమకొండలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటించారు. హనుమకొండ హనుమాన్‌నగర్‌లోని జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ (17) అనే అభిమాని ఇంటికెళ్లి పవన్ పరామర్శించారు. కదల్లేని స్థితిలో మంచానికే పరిమితమైన నిరంజన్‌ను ఆప్యాయంగా పలకరించారు. తల్లిదండ్రులు పొనుగోటి రాంగోపాల్–మానసతో మాట్లాడి నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ క్రమంలో వైద్యం ఎక్కడ చేయిస్తున్నారు? నిరంజన్?ను కాపాడుకోవడానికి ఏం ఏం అవకాశాలు ఉన్నాయన్న విషయంపై ఆరా తీశారు. భగవంతుడి ఆశీస్సులు బాబుకి ఎల్లప్పుడు ఉంటాయని కుటుంబ సభ్యుల్లో మనో ధైర్యం నింపారు. వైద్య ఖర్చుల నిమిత్తం బాలుడికి రూ. లక్ష ఆర్థిక సాయం అందించారు.

### వెంకటేశ్వరస్వామి తీర్థ ప్రసాదాలు

తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు పవన్‌కల్యాణ్ కప్పారు. దేవుడి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అలాగే నిరంజన్ ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్‌కల్యాణ్‌ను అనుకరిస్తూ వేసిన డ్యాన్సు వీడియోలను చూశారు. భద్రకాళి అమ్మవారి ఆలయంలో నిరంజన్ ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు చేయిస్తానని తెలిపారు. అలాగే భద్రకాళి అమ్మవారి ప్రతిమతో పూజలు జరిపి కుటుంబ సభ్యులకు అందజేస్తానని తెలిపారు.

### బాలుడికి ప్రేమతో పవన్ లేఖ

బాలుడిని పరామర్శించిన పవన్? అతనికి చిరకాలం గుర్తుండిపోయేలా ఓ నోట్ రాశారు. "ప్రియమైన నిరంజన్‌కు ప్రేమతో.. దుర్గామాత ఆశీస్సులతో చల్లగా ఉండాలని కోరుకుంటున్నా" అని డైరీలో పవన్ కల్యాణ్ రాసి ఇచ్చారు.

తల్లిదండ్రుల జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. నిరంజన్ తండ్రి గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్‌లో పని చేసేవారని చెప్పారు. అలా వారి జీవనోపాధి మరింత మెరుగుపర్చేందుకు క్యాంటిన్? పెట్టించాలని తెలంగాణ జనసేన నాయకులకి పవన్ తెలియజేస్తానన్నారు. అలాగే బాలుడిని పరామర్శిస్తున్న క్రమంలో అతను పవన్‌కల్యాణ్‌కు కుక్కపిల్ల బొమ్మను చూపి పెంచుకోవాలనిపిస్తుందని తెలిపారు. దీంతో కుక్కపిల్లను కొని పంపుతానని హామీ



ఇచ్చారు. దానిని పెంచుకోవడానికి స్వయంగా ఆ ఇంటి యజమానితో మాట్లాడి అనుమతి ఇప్పించారు.

కాగా బాలుడి పరామర్శ అనంతరం భద్రకాళి అమ్మవారిని పవన్?కల్యాణ్? దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలో అర్చకులు పవన్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని పవన్? కల్యాణ్ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండలో పవన్‌ను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. పవన్‌కల్యాణ్ బాబుని పరామర్శిచడంపై రాంగోపాల్,మానస సంతోషం వ్యక్తం చేశారు. పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. "బాబుకి కిడ్నీ సమస్య ఉంది. ఎడమవైపు కిడ్నీ ఒకటి చిన్నగా ఉంది, కుడివైపుది పెద్దగా ఉంది. పవన్‌కల్యాణ్ మ్యూజిక్ వచ్చిందంటే బాబుకు కాళ్లు, చేతులు ఆగకపోయేది. మంచిగా డ్యాన్స్ చేసేవాడు. నాలుగు నెలల నుంచి ఏం అయ్యిందో గాని మొత్తం బెడ్‌కే అంకితం అయిపోయాడు. బాబుకు పవన్‌కల్యాణ్ అంటే చాలా ఇష్టం. ఇక్కడ బాబుని చోటా గబ్బర్‌సింగ్ అని చాలా మంది పిలిచేవారు"

### తెలంగాణ సీఎంకు పవన్‌కల్యాణ్ కృతజ్ఞతలు

"ఈ రోజు నా వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణ పోలీసు శాఖలోని ఉన్నతాధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తెలంగాణ ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, అభిమానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు, ప్రేమ నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. నాపై మీ మమకారాన్ని జీవితాంతం నా హృదయాంతరాల్లో నిలుపుకొంటాను" పవన్?కల్యాణ్? ఎక్స్? వేదికగా రాసుకొచ్చారు.

# ప్రభుత్వ బడిలో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో కూడిన విద్య

రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్(టీపీఎస్)ను తీర్చిదిద్దింది. ఈ సంవత్సరం ప్రారంభించనున్న వంద పాఠశాలలకు ఇదీ రోల్‌మోడల్. సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు కలలకు ప్రతిరూపం. ప్రభుత్వం గతంలో ఆదర్శ పాఠశాలలు, గురుకులాలను అనేకం ప్రారంభించింది. అయితే ఈ పాఠశాలలకు టీపీఎస్?? భిన్నంగా ఉండటంతో ప్రజలందరి మన్ననలను అందుకుంటోంది. 30 మంది సభ్యులు ఉండే తల్లిదండ్రుల కమిటీని రూ.15 కోట్ల వ్యయంతో తీర్చిదిద్దిన తీరు అపూర్వం. ఈ పాఠశాలను సీఎం రేవంత్‌రెడ్డి నేడు అధికారికంగా ప్రారంభించారు. నేడు నాణ్యమైన విద్య పేదలకు అందని ద్రాక్షలా మారింది. ఈ నేపథ్యంలో నిరుపేద విద్యార్థులకు టీపీఎస్? ఆశాకిరణంలా మారింది. ఈ పాఠశాల పేద, మధ్య తరగతి వారికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తోంది. నాడు చాలీచాలని ఫర్నీచర్? – శిథిలమైన గదులు : ఒకప్పుడు ఆరుట్లలో ఒకే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, మరో ఆదర్శ పాఠశాల ఉండేవి. చాలీచాలని ఫర్నీచర్?, శిథిలమైన గదులు, బోధనోపకరణాల కొరత, అంతంత మాత్రం చదువులు ఇదీ మొన్నటి వరకు ఇక్కడి పాఠశాలల పరిస్థితి. విద్యార్థుల కొరతతో బాలికల పాఠశాల మూతపడింది. అయితే మిగిలిన పాఠశాలల్లో సుమారు 600 మంది విద్యార్థులు ఉండేవారు. నేడు ల్యాబ్‌లు – డిజిటల్ బోధన : అయితే తెలంగాణ పబ్లిక్ స్కూల్ పైలెట్ ప్రాజెక్టును అమలు చేయడానికి తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి ఆరుట్ల పాఠశాలను ఎన్నుకున్నారు. ఈ ప్రాంగణంలోని అన్ని పాఠశాలలను ఒకే గొడుగు కిందికి చేర్చారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం మొదలుపెట్టారు. గత సంవత్సరం జూన్ 12న పాఠశాల పునఃప్రారంభమయ్యాక టీపీఎస్ ప్రవేశాల కొరకు దరఖాస్తులు తీసుకున్నారు. కాగా దీనికోసం 2 వేల దరఖాస్తులు వచ్చాయి. అయితే అడ్మిషన్లను 1600కు పరిమితం చేశారు. కొత్తగా వచ్చిన వారిలో 72 శాతం మంది ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చిన వారే ఉన్నారు. పాఠశాలలో ల్యాబ్‌లు, డిజిటల్ బోధన, ఆటలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇబ్రహీంపట్నం టౌన్ సహా మండలంలోని ఇతర గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థుల ఉన్నారు. ఈ నేపథ్యంలో వీరంతా రాకపోకలు సాగించేందుకు ఐదు బస్సులను ఏర్పాటు చేశారు. దీనికోసం విద్యార్థుల నుంచి నామమాత్రంగా రవాణా ఫీజు వసూలు చేస్తున్నారు. పాఠశాలలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేయాలన్నా పేరెంట్స్ కమిటీ ఆమోదించాల్సి ఉంటుంది. దీనికోసం 30 మందితో కమిటీ ఏర్పాటు చేసి ప్రతి శనివారం సమావేశం ఏర్పాటు చేయనున్నారు. కమిటీ పర్యవేక్షణలో అన్ని పనులూ చేపడతారు. పాఠశాలలో ఖర్చు చేసే ప్రతి రూపాయికీ జవాబుదారీతనం ఉంటుంది. ఇక్కడ వసతుల కోసం ప్రభుత్వం రూ.12 కోట్లు కేటాయించగా సోషల్ డెమోక్రటిక్ ఫోరం (ఎస్‌డీఎఫ్) రూ.3 కోట్లు విరాళంగా ఇచ్చింది.

## రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో వారికే తొలి ప్రాధాన్యత

-మొదటిపేజీ తరువాయి

అధికారులతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమంలో సుమారు 75 వేల మంది తాము గుడిసెల్లో నివసిస్తున్నామని దరఖాస్తు చేసుకున్నారని క్షేత్రస్థాయిలో ఆ వివరాలు పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు కూడా స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో) కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా అర్హులను గుర్తించాలని మంత్రి పొంగులేటి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో గుడిసెల్లో నివసిస్తున్న పేదలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుగా ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గానికి రెండు వేల చొప్పున, రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేసినందువల్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ త్వరగా, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పేదల నివాస భద్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. అసెంబ్లీ నియోజకవర్గానికి 500 చొప్పున తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఇళ్లను ఈ పథకం కింద ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. గోడలు, పునాదులు బలంగా ఉన్నప్పటికీ పైకప్పులు రేకులు, టార్పాలిన్ షీట్లు, నాపరాళ్లతో పాటు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న ఇళ్లను గుర్తించి స్లాబ్ నిర్మాణం కోసం రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఇళ్ల పథకంపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన పలు కీలక సూచనలు చేశారు.

### అసంపూర్తి ఇళ్లను మరోసారి పరిశీలించండి

ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. పాత ఇందిరమ్మ పథకం కింద మంజూరై బేస్‌మెంట్ లేదా పైకప్పు స్థాయిలో నిలిచిపోయిన ఇళ్లను కూడా ఈ పథకంలో చేర్చవచ్చని పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకం కింద నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయిన గృహాలను కూడా గుర్తించి రూఫ్ అప్‌గ్రేడేషన్ కార్యక్రమం ద్వారా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఎల్‌సీ విధానంలో లబ్ధిదారుడే తన ఇంటిని నిర్మించుకొనే అవకాశం కల్పించామని పొంగులేటి తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో స్థలాల కొరతను దృష్టిలో పెట్టుకొని చిన్న స్థలాలున్న లబ్ధిదారులకు అవసరం మేరకు జీ ప్లస్ వన్ నిర్మాణాలకు కూడా అనుమతి ఇవ్వవచ్చునన్నారు.

### అలా నిర్మిస్తే బిల్లులు మంజూరు కావు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించేందుకు పంచాయతీ సెక్రటరీలు క్షేత్రస్తాయికి వెళ్లి పరిశీలిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సంబంధించిన ఫొటోలను తీసి యాప్‌లో అప్?లోడ్? చేస్తారు. అయితే ఆ ఫొటోలను పరిశీలించే బాధ్యతలను ప్రభుత్వం ఈసారి కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్?)కి అప్పగిస్తోంది. ఈ ఫొటోలను ఏఐ స్కాన్ చేస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన పరిమితి ప్రకారం నిర్మాణాలు చేపట్టిన వారిని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇళ్లను ఇది సులభంగానే గుర్తిస్తోంది. ఇలాంటి నిర్మాణాలను 'అనర్హమైనవి'గా ఏఐ తేల్చేస్తోంది. మానవ ప్రమేయం లేకపోవటంతో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకూ లోనుకాకుండా ఇలాంటి అక్రమాలకు సులువుగా అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఏర్పడుతోంది. ఇదే తరహాలో ఇళ్ల నిర్మాణాల్లో అవకతవకలకు పాల్పడిన కొంతమంది హౌసింగ్ ఏఈలను గతంలో విధుల్లో నుంచి తొలగించిన సందర్భాలూ ఉన్నాయి.

## అభివృద్ధి పనుల్లో అవినీతి వరద

-మొదటిపేజీ తరువాయి

రూ.36.9 కోట్ల అక్రమార్జనను గుర్తించింది. లంచాలు తీసుకొని దొరికిన వారిలో, ఎవరి ఆస్తిని లెక్కించినా మార్కెట్ విలువ ప్రకారం రూ.100 కోట్లకు పైనే ఉంటుందని తేలింది. కాళేశ్వరం మాజీ ఈఎన్సీలు మురళీధర్‌రావు, భూక్యా హరిరామ్, ఇరిగేషన్ ఈఈ నూనె శ్రీధర్ నుంచి ఇటీవల అనిశాకు చిక్కిన, హైదరాబాద్ మెట్రోవాటర్ బోర్డు జనరల్ మేనేజర్ అనంత లక్ష్మీకుమార్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మర్రి వంశీమోహన్, ఈ నెలలో దొరికిన భుజంగరావు, మోహన్ నాయక్, నరహరిరావుల ఉదంతాలే ఇందుకు నిదర్శనం.

### లంచాల్లో మొదటి స్థానంలో పోలీసులే

లంచాలు తీసుకొని ఏసీబీకి చిక్కుతున్న వారిని గమనిస్తే అధికంగా ప్రజలతో ప్రత్యక్షంగా సంబంధాలు ఉన్న అధికారులే అధికంగా ఉన్నారని తెలుస్తోంది. వీరంతా ప్రజలను లంచాలు ఇవ్వాలని పీడిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ సంవత్సరం ఏసీబీ చేసిన రైడ్లలో పోలీసు అధికారులే ఎక్కువగా ఉన్నారు. అన్యాయం జరిగిందని పోలీసుల దగ్గరకు వెళ్తే, అమాయకుల దగ్గర నుంచే పైసలు లాగుతున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. ఈ ఏడాది జూన్? 16 వరకు ఏకంగా 14 కేసులు పోలీసులపైనే నమోదు అయ్యాయి.

### తర్వాత స్థానంలో రెవెన్యూ డిపార్ట్‌మెంట్

పోలీసుల తర్వాత అధికంగా లంచాలకు పాల్పడుతున్నది రెవెన్యూశాఖ. ప్రతి కుటుంబానికి నిత్య జీవితంలో రెవెన్యూ శాఖతో సంబంధం ఉంటుంది. దీనివల్ల ప్రతి ఒక్కరి దగ్గర ఎంతో కొంత లంచాలు తీసుకొనేందుకే మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. ఇక నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో పంచాయతీ వ్యవహారాలను చూసేందుకు చాలా వరకు ప్రజలను లంచం అడుగుతున్నారు. ఈ విధంగా ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకొని దొరికిన కాడికి దోచుకుంటున్నారు. ఇదంతా అవినీతికి పరాకాష్ఠగా మారింది.

అక్రమార్జనలో అధికంగా లాగుతుంది మాత్రం అభివృద్ధి పనులు చేయిస్తున్న అధికారులనే తెలుస్తోంది. ఎందుకంటే ప్రభుత్వాలు రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులను చేపడుతున్నాయి. ఈ బాధ్యతలు తీసుకున్న అధికారులు అక్రమంగా లబ్ధి పొందుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం నీటిపారుదలశాఖ చేసిన విశ్రాంత ఈఎన్సీ మురళీధర్‌రావు వద్ద రూ.9.42 కోట్లు గుర్తించగా, ఈఈగా పనిచేసిన నూనె శ్రీధర్ వద్ద రూ.7 కోట్లు, కాళేశ్వరం ఈఎన్సీగా పనిచేసిన భూక్యా హరిరామ్ వద్ద రూ.5.26 కోట్ల ఆక్రమాస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు.

### రవాణాశాఖలోనూ అధికంగా అక్రమార్జన

రోడ్లు, భవనాల అభివృద్ధి అంటూ అధికారులు అందినకాడికి దోచుకుంటున్నారు. వీటికి సంబంధించిన ఉదంతాలు ఇటీవలి కాలంలో ఎన్నో బయటపడ్డాయి. మహబూబ్?నగర్? రవాణాశాఖ ఉప కమిషనర్? కిషన్? రూ. 12.72 కోట్లు కూడబెట్టినట్లు బయటపడింది. ఈ నెలలో అదనపు ఎస్పీ (సస్పెన్షన్) భుజంగరావు రూ.5.92 కోట్లు, రోడ్లు, భవనాల శాఖ ఈఎన్సీ మోహన్‌నాయక్ రూ.17.94 కోట్ల అక్రమార్జన వెలుగులోకి వచ్చింది. తాజాగా మంగళవారం చిక్కిన ల్యాండ్ అండ్ సర్వే డిపార్ట్‌మెంట్ డీడీ సుంకరి నరహరిరావు అక్రమార్జన రూ.13.05 కోట్లుగా తేల్చారు. ఈ ముగ్గురి ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్లో కనీసం రూ.500 కోట్లు ఉంటుంది.

### దూకుడు పెంచిన ఏసీబీ

ఇలాంటి ఘటనలు అధికమవుతుండటంతో ప్రభుత్వం ఏసీబీకి పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. దీంతో ఏసీబీ దూకుడు పెంచింది. ఈ క్రమంలో అక్రమార్కుల చిట్టా ఒక్కొక్కటిగా బయటకు వస్తోంది. 2020లో ఈ కేసులు కేవలం 94 నమోదయ్యాయి. గత ఏడాది ఈ సంఖ్య 199కి చేరింది. అంటే ప్రతి రెండు రోజులకు ఒక కేసు చొప్పున వెలుగులోకి వస్తున్నాయి. అయినప్పటికీ కొంతమంది అధికారులు భయం లేకుండా యూపీఐ ద్వారా లంచాలకు పాల్పడుతున్నారు. వరంగల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినప్పుడు అక్కడున్న ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్‌లకు ఏజెంట్లు ఏడాది కాలంలో రూ.42,03,125 చెల్లించినట్లు గుర్తించారు.

### 2025, 2026లో గుర్తించిన మొత్తం ఆస్తులు

జూన్ 16 వరకు శాఖల వారిగా పోలీసు డిపార్ట్?మెంట్?లో 14 కేసులు, రెవెన్యూలో 13, మున్సిపల్ శాఖలో 8, పంచాయతీరాజ్?లో 8, విద్యాశాఖలో 6 కేసులు నమోదు అయ్యాయి. 2026 లో ఇలా రూ.36,92,84,217 విలువైన ఆస్తులు గుర్తించింది. అధికారిక విలువ ఇంతకు పదిరెట్లకు పైమాటే. 2025లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ రూ.96,13,50,554 విలువైన ఆస్తుల్ని గుర్తించింది. అనధికారికంగా వీటి విలువ కనీసం రూ.వెయ్యి కోట్లు ఉంటుంది.

# మెట్రోలో బ్లేమ్ గేమ్

**హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగర రవాణా ముఖచిత్రాన్ని మార్చేయాల్సిన మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ ప్రాజెక్టు ఇప్పుడు తీవ్రమైన రాజకీయ చదరంగంలో చిక్కుకుంది. కేవలం మౌలిక వసతుల ప్రాజెక్టుగా సాగాల్సిన మెట్రో వ్యవహారం కాస్తా, ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పరస్పర రాజకీయ యుద్ధానికి దారితీసింది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మొదటి దశ మెట్రోను దాదాపు ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియ ముగిసిందని, జపాన్ ఆర్థిక సాయంతో ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా తక్కువ వడ్డీకి రూ. 13,600 కోట్ల రుణం లైన్ క్లియర్ అయిందని భావిస్తున్న తరుణంలో కేంద్రం నుంచి బ్రేకులు పడ్డాయనే వార్త ఒక్కసారిగా దుమారం రేపింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎల్ అండ్ టీ సంస్థ మొదటి దశలో భారీ నష్టాలు రావడంతో రెండో దశ 122 కిలోమీటర్ల విస్తరణను చేపట్టేందుకు నిరాకరించిందని తెలిపారు. కేంద్రం సూచన మేరకే రాష్ట్ర ప్రభుత్వం రూ. 30,000 కోట్ల విలువైన మెట్రో ఆస్తులను రూ. 15,000 కోట్లకు కొనుగోలు చేయడానికి సిద్ధపడిందని, జపాన్ సంస్థ నుంచి వచ్చిన రూ. 13,600 కోట్ల రుణాన్ని ఐఆర్ఎఫ్సీ ద్వారా కేవలం 4 శాతం వడ్డీకే రీఫైనాన్స్ చేయడానికి అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేశామని చెప్పారు. రాష్ట్ర వాటాగా రూ. 1,400 కోట్లు కూడా చెల్లించామన్నారు. అయితే, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి రాజకీయ కారణాలతో, కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌లను కలిసి ఈ నిధుల బదిలీని అడ్డుకున్నారని రేవంత్ తీవ్రంగా ఆరోపిస్తున్నారు. కిషన్ రెడ్డి పగలు బీజేపీలో, రాత్రి వేళ బీఆర్ఎస్ నేత కేటీఆర్ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ కేంద్రానికి ఇష్టం లేకపోతే ఎన్ఓసీ ఇస్తే రాష్ట్రమే పూర్తి భారాన్ని మోస్తుందని సవాల్ విసిరారు.ముఖ్యమంత్రి ఆరోపణలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అంతే తీవ్రంగా ఖండిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 కు వ్యతిరేకం కాదని, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఇప్పటికే దీనికి సూత్రప్రాయ ఆమోదం తెలిపారని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్ట్ వ్యయంలో 50 శాతం నిధులు కేంద్రమే ఇవ్వబోతోందని, ఇంత పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేసేటప్పుడు సమగ్ర పరిశీలన అవసరమని పేర్కొన్నారు. తనపై రేవంత్ రెడ్డి చేస్తున్నవన్నీ అభూతకల్పనలని, రాష్ట్రంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యం చెందిందని, ప్రజా వ్యతిరేకత నుంచి దృష్టి మళ్లించడానికే ఈ



మెట్రో డ్రామా ఆడుతున్నారని రివర్స్ అటాక్ చేశారు. సీనియర్ జర్నలిస్టులతో కమిటీ వేసి నిజాలు నిరూపిస్తే తాను రాజీనామాకైనా సిద్ధమని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు.ఈ వివాదంలోకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు కూడా ఎంట్రీ ఇచ్చారు. మెట్రో ప్రాజెక్టు ఆలస్యానికి, రుణాల నిలిపివేతకు రేవంత్ రెడ్డి పరిపాలనా అసమర్థతే కారణమని ఆయన విమర్శిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలోనే మెట్రో మొదటి దశను విజయవంతంగా పూర్తి చేశామని, తాము సిద్ధం చేసిన ఫేజ్-2 రూట్ మ్యాప్‌లను మార్చడం వల్లే ప్రాజెక్ట్ గందరగోళంలో పడిందని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తూ నిధులు తీసుకురావడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, దాన్ని కప్పిపుచ్చుకోవడానికే బీఆర్ఎస్, బీజేపీలు కలిసి కుట్ర చేస్తున్నాయంటూ రేవంత్ రెడ్డి కొత్త కథలు అల్లుతున్నారని విమర్శించారు.ఈ ముక్కోణపు రాజకీయ యుద్ధం మధ్య నలిగిపోతున్నది మాత్రం సగటు హైదరాబాద్ పౌరుడే. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, చాంద్రాయణగుట్ట, నాగోల్ కారిడార్లను అనుసంధానిస్తూ ప్రతిపాదించిన 122 కిలోమీటర్ల భారీ విస్తరణ ఇప్పట్లో పట్టాలెక్కేలా కనిపించడం లేదు. ఎల్ అండ్ టీ నుంచి మొదటి దశ మెట్రో ఆస్తుల బదిలీ, రుణాల టేకోవర్ సవ్యంగా సాగితేనే రెండో దశకు అంతర్జాతీయ బ్యాంకుల నుంచి నిధులు సమకూరుతాయి. ఇప్పుడు ఐఆర్ఎఫ్సీ లోన్ క్లియరెన్స్ పెండింగ్‌లో పడటం ప్రాజెక్టు టైమ్‌లైన్‌ను దెబ్బతీస్తుంది. టెక్నికల్ కారణాల కంటే ఇక్కడ ఇగోలు, రాజకీయ ప్రయోజనాలే ఎక్కువైపోయాయి. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోతే మెట్రో వంటి మెగా ప్రాజెక్టులు ముందుకు పడవు.గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న హైదరాబాద్‌కు ట్రాఫిక్ కష్టాలు తీరాలన్నా, రియల్ ఎస్టేట్ రంగానికి ఊపు రావాలన్నా మెట్రో ఫేజ్-2 అత్యంత కీలకం. దేశంలోని అహ్మదాబాద్, ఉత్తరప్రదేశ్, వైజాగ్ వంటి నగరాలకు మెట్రో నిధులు వస్తున్నప్పుడు హైదరాబాద్‌కు ఎందుకు ఆలస్యం అవుతుందనే రాష్ట్ర ప్రభుత్వ వాదనలో కొంత నిజం ఉన్నప్పటికీ.. కేవలం ఢిల్లీపై నిందలు వేసి చేతులు దులుపుకుంటే సరిపోదు. ఇప్పటికైనా రాజకీయాలు పక్కనబెట్టి సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇద్దరూ కూర్చుని, కేంద్ర అధికారులతో మాట్లాడి ఈ రూ. 13,600 కోట్ల లోన్ క్లియరెన్స్‌ను సాధించడమే నగరానికి శ్రేయస్కరమని లేదంటే 'మెట్రో విస్తరణ' కేవలం కాగితాలకే పరిమితమై, గాల్లో దీపంలా మారే ప్రమాదం ఉందని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

# కాంగ్రెస్‌లో కోల్డ్ వార్...

**హైదరాబాద్ :** తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పరిణామాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన తరుణంలో.. కీలక నేతల మధ్య అభిప్రాయ బేధాలు ఒక్కొక్కటిగా బహిర్గతమవుతున్నాయి. ఇటీవల మాజీ మంత్రి షబ్బీర్ అలీ చేసిన వ్యాఖ్యల దుమారం పూర్తిగా చల్లారకముందే.. తాజాగా తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో చేసిన 'హిట్లర్' వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ బహిరంగంగానే అసమ్మతి వ్యక్తం చేయడం ఇప్పుడు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.. పీసీసీ చీఫ్ క్లారిటీ ఇటీవల ఒక ప్రైవేట్ న్యూస్ ఛానల్ నిర్వహించిన టాక్ షోలో పాల్గొన్న మహేష్ కుమార్ గౌడ్‌కు ఒక ఆసక్తికరమైన ప్రశ్న ఎదురైంది. గతంలో బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పాలనలో కొన్నిసార్లు హిట్లర్ లాంటి కఠిన నిర్ణయాలు కూడా అవసరమనే కోణంలో వ్యాఖ్యానించారు. దీనిపై యాంకర్ ప్రశ్నించగా పీసీసీ చీఫ్ ఏమాత్రం సంకోచించకుండా తన అసంతృప్తిని బయటపెట్టారు. "సీఎం రేవంత్ రెడ్డి చేసిన హిట్లర్ వ్యాఖ్యలతో నేను ఏకీభవించను. అది పూర్తిగా ఆయన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. హిట్లర్‌ను ప్రపంచవ్యాప్తంగా ఒక క్రూరమైన నియంతగా.. విలన్‌గా భావిస్తారు. అలాంటి వ్యక్తిని ఎవరూ ఆదర్శంగా తీసుకోలేరు.. ఆయన చర్యలను సమర్థించలేం" అని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అంతేకాదు ఈ అంశంపై ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్టాన వర్గాల్లో కూడా అంతర్గతంగా చర్చ జరిగినట్లు ఆయన వెల్లడించడం విశేషం. గాంధీ సిద్ధాంతాలను నమ్మే కాంగ్రెస్ పార్టీలో ఇలా నియంతల ప్రస్తావన రావడం సరికాదనే భావన ఆయన మాటల్లో వ్యక్తమైంది. హైడ్రా చర్యలపై కీలక వ్యాఖ్యలు ఇదే ఇంటర్వ్యూలో హైదరాబాద్‌లో సంచలనం సృష్టిస్తున్న హైడ్రా పనితీరుపై కూడా మహేష్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు



చేశారు. నగరంలో చెరువుల పరిరక్షణకు.. అక్రమ నిర్మాణాల తొలగింపునకు హైడ్రా చర్యలు అవసరమేనని ఆయన అంగీకరించారు. అయితే అదే సమయంలో బాధితుల పక్షాన నిలబడతానని హామీ ఇచ్చారు. హైడ్రా చర్యల వల్ల పేదలకు లేదా ఎవరికైనా అన్యాయం జరిగిందని తన వద్దకు వస్తే, వారికి ఖచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారు. కొన్ని సందర్భాల్లో క్షేత్రస్థాయిలో అధికారుల తొందరపాటు చర్యల వల్ల తప్పులు జరిగి ఉండవచ్చని.. అలాంటి వాటిని సరిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారుప్రతిపక్షాల విమర్శలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయానికి భిన్నంగా రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి లాంటి పీసీసీ చీఫ్ బహిరంగంగా స్పందించడం ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. దీనిని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నేతలు అస్త్రంగా మార్చుకున్నారు. "ముఖ్యమంత్రి వైఖరి పార్టీ నేతలకే నచ్చడం లేదనడానికి ఇదే నిదర్శనం" అని గులాబీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు ఇటీవల కొన్ని మీడియా సంస్థల్లో తనపై వచ్చిన నెగెటివ్ కథనాల వెనుక కాంగ్రెస్ పార్టీలోని కొందరు కీలక నేతల హస్తం ఉందనే అనుమానంతో పీసీసీ చీఫ్ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి ఆయన కొందరు ముఖ్య నేతలతో కాస్త దూరంగానే ఉంటున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతోంది. మొత్తానికి షబ్బీర్ అలీ వ్యాఖ్యల వివాదం.. పీసీసీ చీఫ్‌పై మీడియా కథనాలు.. ఇప్పుడు రేవంత్ వ్యాఖ్యలపై మహేష్ కుమార్ గౌడ్ ఓపెన్ స్టేట్‌మెంట్స్.. ఇవన్నీ తెలంగాణ కాంగ్రెస్‌లో 'కోల్డ్ వార్' నడుస్తోందనే అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో ఎలాంటి రాజకీయ మలుపులు తిరుగుతాయో చూడాలి

# సోలార్ ప్యానెల్స్ తో జలమండలి

**హైదరాబాద్ :** జలమండలికి పెరుగుతున్న విద్యుత్ వినియోగం, అదే స్థాయిలో అందుతున్న భారీ కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడానికి సౌర విద్యుత్ ఉత్పత్తి వైపు అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టును మూడు దశల్లో చేపట్టాలని నిర్ణయించుకోగా, తాజాగా దీనికి కార్యాచరణ సిద్ధమైంది.మొదటి దశలో భాగంగా మల్లారం, పెద్దాపూర్, కొండపాక ప్రాంతాల్లో రూ. 383 కోట్ల వ్యయంతో భారీ సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్లాంట్ల ద్వారా 67.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలోనే ఈ పనుల కోసం టెండర్లు పిలవడానికి వాటర్ బోర్డు సిద్ధమైంది.నగరానికి సరఫరా చేస్తున్న నీటిలో కృష్ణా, గోదావరి నదుల నుంచి ఎత్తిపోతల ద్వారా వస్తున్న నీరే కీలకం. మంజీర జలాలు కూడా పాక్షికంగా ఎత్తిపోతల పథకాలపై ఆధారపడి ఉండటంతో, జలమండలికి భారీగా విద్యుత్ అవసరమవుతోంది. ప్రస్తుతం జలమండలి నెలకు రూ. 120 కోట్ల మేర విద్యుత్ ఛార్జీలను చెల్లిస్తోంది.జలమండలికి అనేక ప్రాంతాల్లో సొంత ఖాళీ స్థలాలు ఉండటమే కాకుండా, పలుచోట్ల భారీ రిజర్వాయర్లు ఉండటం వల్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు పరిస్థితులు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఆర్ఈడీసీఓ) సమన్వయంతో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 72 ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి అవకాశం ఉందని జలమండలి అధికారులు గుర్తించారు.

## ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఏ. భాస్కర్ రావు**




**భువనగిరి జిల్లా ప్రతినిధి, జూన్ 17(సంచలనం న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్ రావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే నాణ్యమైన విద్యతో పాటు వివిధ రకాల సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించి, ప్రజా ప్రతినిధుల సహకారంతో నమోదు పెంచే కృషి చేయాలని కోరారు. జిల్లా కలెక్టరేట్ నుండి జరిగిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఐ.ఈ.ఆర్పీల సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలలో ఉన్నత స్థాయిలో బోధన జరుగుతున్న విషయం, ఉన్న సదుపాయాలను సమాజానికి తెలియజేసి బడిబాటను విజయవంతం చేయాలన్నారు. విద్యార్థులకు వెంటనే బేస్ లైన్ సర్వే ఖచ్చితంగా నిర్వహించి, నాణ్యమైన విద్యను అందించే విధంగా ప్రత్యేక ప్రణాళికతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో ఉన్న విద్యార్థులకు అందరికీ ఆధార్ కార్డును అందించి, 100 శాతం యూ డైస్ లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న సివిల్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. జిల్లాలో గుర్తించిన 62 శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను కూల్చివేయడానికి సంబంధించిన అనుమతులు మంజూరు చేసి, వర్షాలు రాక ముందే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో 4 సంవత్సరాలు పూర్తి అయిన పిల్లలు ప్రీ ప్రైమరీ పాఠశాలలలో, బడి ఈడు పిల్లలు అందరూ బడిలో ఉండేలా, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా పెరిగేలా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ బొల్లారం భిక్షపతి కోరారు. భవిత కేంద్రాల్లో దివ్యాంగ విద్యార్థుల సంఖ్య పెంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా టీ.జీ.ఈ.డబ్ల్యు. ఐ.డి.సి డీ.ఈ.ఈ.ఎం.శివ కుమార్, మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సెక్టోరియల్ అధికారులు పెసరు లింగారెడ్డి, షేక్ జానీ అఫ్ఘన్, శ్రీహరి అయ్యంగార్, సి.హెచ్.రాధ,ఏ.ఎస్.సీ.ఓ.నరహరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందించాలి

**- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**భువనగిరి జిల్లా ప్రతినిధి, జూన్ 17(సంచలనం న్యూస్):** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం భువనగిరి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలో ఆబా రిజిస్ట్రేషన్ చేసే విధానాన్ని స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులను తెలుసుకున్నారు. మన యాదాద్రి భువనగిరి జిల్లా మోడల్ జిల్లాగా ఎంపిక చేసినందుకు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ లో భాగముగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఎకౌంటు లో నమోదు సంఖ్య పెంచమని ఆదేశించారు. ఆసుపత్రిలో శానిటేషన్, బ్లడ్ బ్యాంకు, నవజాత శిశువు ప్రత్యేక సంరక్షణ లో అందిస్తున్న సేవలగురించి, బాలింత తల్లులకు మరియు పిల్లలకు అందుతున్న సేవలు, ల్యాబ్ లో అందిస్తున్న పరీక్షల వివరాలు, టీ హబ్ లో అందుతున్న సేవల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పనిచేయుచున్న ఉద్యోగుల మరియు ఇంకా ల్యాబ్ టెక్నీషియన్స్ భర్తీచేయుటకు అవకాశాలు గురించి తెలుసుకున్నారు. ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశం నిర్వహించుటకు తేదీని నిర్ణయించుమని ఆదేశాలు ఇచ్చారు. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది సమయానికి వస్తున్నారా అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ప్రతి రోజు ఇన్ పేషెంట్, ఔట్ పేషంట్ ఎంతమంది పేషంట్లు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న వార్డులను పరిశీలించారు. వార్డు లో చికిత్స పొందుతున్న పేషెంట్లను వారికి అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయని అడిగి తెలుసుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమం లో ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ కె.అరుణకుమారి, డాక్టర్. ఏ.జయలక్ష్మి, సివిల్ సర్జన్/ఆర్ఎంవో, సిఏఎస్/ఆర్ఎంవో, డిఎం హెచ్చో, సహాయ సంచాలకులు, నర్సింగ్ ఆఫీసర్స్, వివిధ శాఖ అధికారులు, మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల అభివృద్ధికి భాగస్వాములవ్వాలి



**హయత్ నగర్, జూన్ 17(సంచలనం న్యూస్):** ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు ఆవ్వాలని హయత్ నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం పి.ఇందిరా, ఎంపీపీఎస్ హెచ్ఎం దయాల్ రెడ్డి అన్నారు. పాఠశాలలోని 100 మంది విద్యార్థులకు రూ.వెయ్యి పైగా విలువైన నోట్ బుక్స్, బ్యాగుల కిట్లను జోయాలుకాస్ వనస్థలిపురం బ్రాంచ్ వారు బుధవారం పంపిణీ చేశారు. జాయ్ ఆఫ్ స్కూల్ పేరిట వాటిని అందజేశారు. కార్యక్రమంలో వనస్థలిపురం జెడ్పీహెచ్ఎస్ రిటైర్డ్ జీహెచ్ఎం ఎల్.రవీందర్, జోయాలుకాస్ బ్రాంచ్ మేనేజర్ షరీఫ్, కోటేశ్వరరావు, సురేష్, తదితరులు ఉన్నారు.

Publisher & Owner by Reesaanvi Media House, H.No: 6-25, Kothagudem, Ramannapet, Yadadri Bhuvanagiri- 508113, Chief Editor: Bathula Ganesh.
H.No: 6-25, Kothagudem, Ramannapet, Yadadri Bhuvanagiri- 508113, Regd. No: TS-30-0043998, Email: sanchalanamnewsdesk@gmail.com, Cell: 9177108128